అరుదైన శస్త్ర చికిత్స

మహిళ కడుపులో నుంచి 10 కేజీల క్యాన్సర్ గడ్డ తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి తదితరులు

హఫీజ్‌పేట్: ఓ మహిళ కడుపులో నుంచి 10 కేజీల క్యాన్సర్ గడ్డను తొలగించారు మదీనాగూడలోని అర్చన ఆసుపత్రి వైద్యులు. సోమవారం విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ నగరానికి చెందిన రేష్మ అనే మహిళ గత సంవత్సరం నుంచి కడుపు నొప్పి, ఉబ్బరంతో బాధపడుతుంది. దీంతో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను మదీనాగూడలోని అర్చన ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించగా రక్తస్రావం తీవ్రంగా ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆమెకు సీటీ స్కాన్ చేయగా కడుపులో 10 కేజీల క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు తేలింది. దీంతో డాక్టర్లు శస్త్ర చికిత్స ద్వారా గడ్డను తొలగించారు. ఆమె ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఆదర్శకుమార్ గోయల్

శేరిలింగంపల్లి: విద్యార్థులు దేశభక్తి, సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ప్రపంచంలో ఏ దేశానికి లేని యువ శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) జాతీయ అధ్యక్షులు ఆదర్శకుమార్ గోయల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్ వికాస్ పరిషత్ నమో గంగా గచ్చిబౌలి బ్రాంచ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి హైస్కూల్‌లో అనిమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శకుమార్ గోయల్ మాట్లాడుతూ యువ శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వాలు వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా శ్రద్ధ పెట్టాలని సూచించారు.నీటి వనరులను వృథా చేయవద్దని, పొదుపుగా వినియోగించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీవీపీ రాష్ట్ర అధ్యక్షులు డి.సతీష్‌గౌడ్, విద్యాంజలి స్కూల్ వ్యవస్థాపకులు లేగల వెంకట్‌రెడ్డి, కరస్పాండెంట్ లేగల నర్సింహారెడ్డి, స్కూల్ అడ్వైజర్ మమతారెడ్డి, సాత్విక్ రెడ్డి, ప్రిన్సిపాల్ బాలత్రిపురసుందరి, డాక్టర్ సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ఉగాది వేడుకలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం సంపాదకులు, జోతిష్యులు ,ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మచే పంచాంగ పఠనం నిర్వహించనున్నారు. డాక్టర్ హిమబిందు కనోజ్ శిష్యబృందంచే ఋతుశోభ కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించనున్నారు. హరేరామ హరే కృష్ణ సంస్థ నుంచి మధ్యాహ్నం భోజన వసతి కల్పించనున్నారు. బొబ్బట్లు, పూర్ణాలు, పులిహోర, సాంప్రదాయ వంటలను నామమాత్ర రుసుముతో సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్: ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సూచించారు. పట్టణంలోని మహిళా మండలి ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన కార్యక్రమంలో బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు ఓటర్లను చైతన్యపర్చాలని సూచించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..



మీర్ ఖాజామ్ అలిఖాన్

మియాపూర్: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ దుర్గారామలింగప్రసాద్, డీఐ అక్రమ్ బాబా తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని టోలిచౌక్‌లోని సూర్యనగర్ కాలనీకి చెందిన మీర్ ఖాజామ్ అలిఖాన్ అలియాస్ సూర్యభాయ్(30). స్థానికంగా ఓ హోటల్ నిర్వహిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొన్ని సంవత్సరాలుగా తాళంవేసిన ఇళ్లను పరిశీలించి ఎవరూ లేని సమయంచూసి సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 12 గంటల మధ్యలో ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులను ఎత్తుకెళ్లేవాడు. ఈ క్రమంలో ఇతనిపై 88 కేసులుండగా జైలుకు వెళ్లివచ్చాడు. జైలుకు వెళ్లివచ్చాక కూడా 12 కేసులు నమోదయ్యాయి. జైలుకు వెళ్ళొచ్చాక కూడా తన బుద్ధి మార్చుకోకుండా మళ్లీ దొంగతనాలు చేయసాగాడు. ఈ క్రమంలో మియాపూర్ ఆల్విన్‌కాలనీలో మొవ్వా సాయికృష్ణ కుటుంబం నివసిస్తోంది. మార్చి 20వ తేదీ అతని భార్య పిల్లలతో కలిసి విజయవాడ వెళ్లింది. 22వ తేదీ సాయికృష్ణ ఉదయం 8 గంటలకు ఉద్యోగానికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంట్లో వంటగది తలుపులు పగులగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా అందులో ఉన్న 100 గ్రాముల బంగారు బిస్కెట్‌లు, రూ.50వేల నగదు ఇతర బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని గ్రహించి 23వ తేదీ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మియాపూర్ కూడలివద్ద ఈ నెల 6వ తేదీ సాయంత్రం వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆటువైపు వచ్చిన మీర్ ఖాజామ్ అలీఖాన్‌ను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఇతనికి దొంగతనాల్లో సల్మాన్,రియాజ్ అనే ఇద్దరు వ్యక్తులు సహకరిస్తుండేవారని వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దీంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్దనుండి 36 తులాల బంగారం, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హైస్కూల్ పనులు పూర్తయ్యేదెన్నడు ?

నత్తనడకన మన బస్తీ- మన బడి పనులు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మనబస్తీ-మనబడి' కార్యక్రమం ముందుకు సాగడం లేదు. శేరిలింగంపల్లి మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 24 స్కూళ్లు ఎంపిక చేశారు. అందులో భాగంగానే శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.43 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి.

శేరిలింగంపల్లి హైస్కూల్‌లో చేసిన పనులు ఇవే..

- హైస్కూల్ ప్రహరీ నిర్మాణం.
- స్కూల్ ఓల్డ్ బిల్డింగ్ పైభాగంలో చుట్టూ పారాపీట్ వాల్

చేయాల్సిన పనులు ఇవే..

- నూతనంగా చేపట్టిన వాటిలో ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయాలి
- తరగతి గదుల్లోని తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయాలి



శేరిలింగంపల్లి హైస్కూల్ బిల్డింగ్

- తరగతి గదుల్లో షాబాద్ స్టోన్, మెట్లపైనా..
- కరెంట్ లైన్లు వేసిన వాల్స్‌పై చేసిన హోల్స్ ఇంకా పూడ్చలేదు.
- డైనింగ్ హాల్ నిర్మించాల్సి ఉన్నా, అందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఆ పనులను ఇందులో చేర్చలేదు.

సివిల్ పనులు పూర్తయిన తర్వాత చేయాల్సిన పనులు..

- స్కూల్ బిల్డింగ్‌కు రంగులు వేయించాలి.
- విద్యార్థులకు అవసరమైన డ్యూయల్ డెస్క్ టేబుళ్లు అందుబాటులోకి తేవాలి
- డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలి.

పనులు పూర్తి చేయిస్తాం

హైస్కూల్‌లో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు కాంట్రాక్టర్ వల్లే ఆలస్యం అయ్యాయి.పనులు చేపట్టకపోతే నోటీసులు జారీ చేసి, వేరే కాంట్రాక్టర్‌తో చేయిస్తాం. తిరిగి పాఠశాల ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయించాలనేదే లక్ష్యం. - శ్యామ్, ఏఈ

ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఈద్గా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తనయుడు గడ్డం ఆర్యన్ రెడ్డి, అల్లుడు రాజేష్ రెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ నాయకులు సిద్దార్థ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

పార్కు పనుల పరిశీలన

నిజాంపేట్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ పార్కును కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న లెవలింగ్, వాకింగ్‌ట్రాక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పిల్లల ఆట స్థలాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నామని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. సోమవారం అమావాస్య కావడంతో అలాపూర్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో అన్నదానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో అసోసియేషన్ ముందుంటుందన్నారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ సభ్యులపై కేసు నమోదు

మియాపూర్: అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని కేఎస్‌ఆర్ -2 గెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షుడు, కోశాధికారి కార్యదర్శులు అసభ్య, పరుష పదజాలంతో దూషించడంతోపాటు వేధింపులకు గురిచేశారంటూ మియాపూర్ పోలీసులను ఆశ్రయించి వారిపై ఫిర్యాదు చేసింది. ఫ్లాట్ నంబర్ 901లో తులసి భర్త చనిపోవడంతో ఆమె కుమారుడితో కలిసి ఉంటోంది. కొద్ది రోజుల నుంచి కమ్యూనిటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వసంత్‌రెడ్డి, కార్యదర్శి రాజు తులసిని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. ఆమె ఫ్లాట్‌లో పనిచేయడానికి వచ్చే పనివారిని సైతం అపార్ట్‌మెంట్‌లోకి రానివ్వకుండా అడ్డుకోవడం, పార్కింగ్ ప్రదేశాల్లో కారు పెట్టనివ్వకపోవడం, వ్యక్తిగత విమర్శలు చేస్తూ వేధించసాగారు. దీంతో తులసి ఈ నెల 6వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన సీఐ దుర్గ రామలింగప్రసాద్ అపార్ట్‌మెంట్ సభ్యులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విజేత సూపర్‌మార్కెట్ వార్షికోత్సవం




విజేత సూపర్ మార్కెట్ లక్కీ డ్రా మొదటి విన్నర్‌కు కారు పత్రాలు అందజేస్తున్న నారా బ్రాహ్మణి, ఎమ్మెల్యే గాంధీ, సంస్థ ఎండీ జగన్ మోహన్‌రావు తదితరులు

కూకట్‌పల్లి: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రధాన్ కన్వెన్షన్‌లో విజేత సూపర్ మార్కెట్ 25వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బుల్లితెర నటి సుమ వ్యవహరించారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు అందించటం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందిందని తెలిపారు. విజేత సూపర్‌మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ వచ్చే 10 సంవత్సరాల్లో స్టోర్ల సంఖ్యను 200కు పైగా విస్తరించి వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకొని వేలాదిమందికి ఉపాధి కల్పించటమే ధ్యేయంగా ముందుకెళుతున్నామన్నారు. ఈ సంబరాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్న విజేత ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. లక్కీ డ్రా విజేతలకు మొదటి బహుమతిగా టాటా నెక్సాన్ కారు, రెండవ బహుమతిగా 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు, మూడో బహుమతిగా 25 చేతక్ కర్బన్ ఎలక్ట్రికల్ స్కూటర్లు, బోనస్ బహుమతులుగా 111 ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్లను అందజేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సందీప్, సిద్ధార్థ, కృష్ణవేణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగాది అంటే యుగానికి ఆది..

వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదాపీఠ పాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం ఆర్కిటెక్ట్ యెండూరి సురేష్ బాబు సౌజన్యంతో, పాలకమండలి సహకారంతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్‌సీయూ ఆచార్య వంగర త్రివేణి, ఆచార్య బాశెట్టి లత, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, అవధాని ములుగు అంజయ్య, కటుకం వెంకటరామశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం ప్రకారం ఉగాది అంటే యుగానికి ఆది అభి, నక్షత్రానికి ఆది అన్నారు. ఉగాదిని మనం చైత్ర శుక్ల పాడ్యమి రోజున చేసుకుంటామన్నారు. ఋతువులన్నింటిలో చైత్రం శ్రేష్టమైందన్నారు. మన సంస్కృతాంధ్ర కావ్యాలెన్నింటిలోనో వసంత ఋతు వర్ణనలు ఉన్నాయన్నారు. ఉగాది పచ్చడి, పంచాంగం ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం 60 మంది కవులను సత్కరించారు. హాస్య బ్రహ్మ శంకరనారాయణ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, ఆలయ పాలక కమిటీ సభ్యులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నందూరి వెంకటేశ్వర రావు, విజయలక్ష్మి, జనార్ధన్, నల్ల గొర్ల శ్రీనివాసరావు, జీవీ రావు, జిల్ మల్లేష్, ఉమా చంద్రశేఖర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సిసిరో అకాడమీలో ప్రపంచస్థాయి శిక్షణ

కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా డా.ప్రీతి అడుసుమిల్లి



మాదాపూర్: ప్రతిష్టాత్మకమైన కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా 2024, క్లాసిక్ మిసెస్ ఇండియా 2024 క్రౌన్ విన్నర్ కిరీటాన్ని డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి పొందారు.మిసెస్ ఇండియా పేజెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఇటీవల గుర్గావ్‌లో జరిగాయి. కాగా మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ సిసిరో అకాడమీలో మహిళలకు మేక్ ఓవర్, గ్రూమింగ్, హెయిర్ స్టైలిస్ట్, బ్యూటీషియన్, అడ్వాన్స్‌డ్ కాస్మోటాలజీలో మూడు నగరాలలో విద్యార్థులకు ప్రపంచస్థాయి శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. 30 రోజుల కోర్సు నుంచి 3 సంవత్సరాల డిప్లొమా కోర్సు వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్, డాక్టర్లు పాల్గొన్నారు.

ట్యాంకర్ల నీరే దిక్కు..!

- మణికొండ మున్సిపల్ పరిధిలో అడుగంటిన భూగర్భ జలాలు
- వట్టిపోయిన బోర్లు
- ట్యాంకర్లకు ఫుల్ డిమాండ్
- రెండు రోజులకు డెలివరీ
- ఇదే అదనుగా 'ప్రైవేటు' రేటు పెంపు



మణికొండలో నీటి సరఫరాకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నీటి కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో చాలావరకు బోర్లు వట్టిపోయాయి. దీంతో మణికొండలో జలమండలితో పాటు ప్రైవేట్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిపోయింది. జలమండలి ట్యాంకర్‌ను బుక్ చేస్తే రెండు రోజులకు డెలివరీ అవుతుండగా, ప్రైవేట్ ట్యాంకర్లు త్వరగా వస్తున్నా ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. జలమండలి సరఫరా చేస్తున్న నీరు లో ప్రెషర్‌తో వస్తుండడంతో ఏ మాత్రం సరిపోవడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. అత్యవసరం అయితే ట్యాంకర్ రెండు రోజులకు వస్తే అవసరాలు ఎలా తీరతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గండిపేట నీరు అందుబాటులోకి వచ్చినా..

మణికొండ మున్సిపాలిటీకి గతంలో కేవలం మంజీరా నీటిని మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం 2 రోజుల నుంచి గండిపేట నీటిని మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసి ట్యాంకర్లను అందుబాటులోకి తెచ్చారు. అయినా ట్యాంకర్ల సరఫరాకు రెండు రోజులు పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి ఉన్నతాధికారులు 24 గంటల పాటు ట్యాంకర్లను డిమాండ్ మేరకు సరఫరా చేస్తున్నామని ప్రకటిస్తున్నా అది క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్లను కట్టడి చేయండి..

మణికొండ మున్సిపాలిటీ ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దాంతో వారు డిమాండ్‌ను బట్టి ఒక్కో ట్యాంకర్‌కు రూ.900ల నుంచి ఏకంగా రూ.1500ల వరకు దండుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్న వారిని రెవెన్యూ, మున్సిపల్, జలమండలి అధికారులు కట్టడి చేయాలని వారు కోరుతున్నారు. అలాగే వారు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించడంతో పాటు ఒక్కో ట్యాంకర్‌కు రూ. 700లు మాత్రమే వసూలు చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని, అలా చేయని వారి ట్యాంకర్లను సీజ్ చేయాలని వారు కోరుతున్నారు.

డిమాండ్ పెరిగిపోయింది..

మణికొండలో ఇంతకుముందు 5 ట్యాంకర్లు ఉండగా వాటిని 19 కి పెంచి ఫిల్లింగ్ కేంద్రాలను సైతం పెంచాం. అత్యధికంగా బోర్లు వట్టిపోవడంతో ఎక్కువ మంది ట్యాంకర్ డెలివరీ కాగానే తిరిగి బుక్ చేస్తుండటంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. గతంలో రోజుకు 80 ట్యాంకర్ల డిమాండ్ ఉండగా ప్రస్తుతం 300లకు పెరిగింది. రెండు ఫిల్లింగ్ కేంద్రాల్లోనూ మరో రెండు పాయింట్లు పెంచాం. దాంతో శనివారం బుకింగ్ చేస్తే సోమవారం మధ్యాహ్నం వరకు సరఫరా చేసి ఆ తరువాత ఆదివారం బుకింగ్స్‌కి సరఫరా చేస్తున్నాం. నీటి లభ్యత పెరగడంతో మరిన్ని ట్యాంకర్ల పెంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.
– సూర్తిరెడ్డి, మేనేజర్, జలమండలి

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం

పటాన్‌చెరు: చిరుధాన్యాలతో (మిల్లెట్లు) మంచి ఆరోగ్యం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'వ్యవసాయ-ఆహార పర్యావరణ వ్యవస్థలో చిరుధాన్యాలు, తినదగిన అడవి జాతులను ప్రధాన స్రవంతిలోకి తేవడం' అనే అంశంపై సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. గీతం విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ హెల్త్ అండ్ ఇన్నోవేషన్ (సీహెచ్ఎడబ్ల్యూఐ), బ్రిటన్ లోని, కోవెంట్రీ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ అగ్రోకాలజీ, వాటర్ అండ్ రెసిలెన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలు, ఇతర వినియోగించని ఆహారాలపై వారు ప్రత్యేక దృష్టి సారించారు. వాటి వినియోగానికి సంబంధించిన సవాళ్లన్ని చర్చించారు. పోషకాహార సమస్యలను పరిష్కరించడానికి తమ పరిశోధన సహకారం అందించడంతో పాటు చిరుధాన్యాల సేద్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని వివరించారు.

ఓటుపై అవగాహనకు 10న 5కే రన్

సాక్షి, సిటీబ్యూరో: ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న 'నేను తప్పకుండా ఓటు వేస్తాను' అనే నినాదంతో 5కె రన్ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఏప్రిల్ 10న ఉదయం 6 గంటలకు శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుండి ప్రారంభమై, హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు వెళుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా 5కె రన్ లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటాలని, వివిధ శాఖల అధికారులతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున 5కె రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఇఓ వికాస్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జాయింట్ సిఇఓ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

ఆలయాల్లో ఉగాది వేడుకలు

రాయదుర్గం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు వివివిఎస్‌శర్మ పర్యవేక్షణలో రాత్రి 7 గంటలకు పంచాంగ పఠనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. తొమ్మిదిరోజుల పాటు స్వామివారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండాలు కళ్యాణోత్సవం, రథోత్సవం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్యల ఆధ్వర్యంలో తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలను చేపట్టారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి రుద్రహోమం చేపట్టారు. స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి దేవాలయ ఈఓ శశిధర్ కృతజ్ఞతలు చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



హఫీజ్‌పేట్: చందానగర్‌లో నేరెడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్, సరస్వతీ విద్యా మందిర్ సౌజన్యంతో పాఠశాల వద్ద చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.కార్యక్రమంలో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ, చెన్నారెడ్డి, నరేంద్ర ప్రసాద్, వీరారెడ్డి, యభూ పెరల్, సురేష్, స్కూల్ ప్రతినిధులు రఘునందన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవీనగర్ అసోసియేషన్ నూతన కమిటీ

భాగ్యనగర్‌కాలనీ: మాధవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మురళీధర్‌రెడ్డి, ఎం. రామ్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వై. రఘుకుమార్, జాయింట్ సెక్రటరీలుగా రమణమూర్తి, రామారావు, సి. చెన్నారెడ్డి, కోశాధికారులుగా ఎం. బ్రహ్మారెడ్డి, జె. సత్యనారాయణ, మహీధర్‌రెడ్డిలు, కమిటి కార్యనిర్వాహక సభ్యులుగా జయపాల్‌రెడ్డి, కె. బాలాజీ, సివిఆర్‌జి విశ్వేశ్వరరావు, వి. కృష్ణ, ప్రసాద్ రూపిచర్ల, కమలాకర్‌రెడ్డి, జి. శ్రీనివాస్ రెడ్డి, టి. వేణుబాబు, ఎస్. మాధురీరెడ్డి, ఎ.చంద్రశేఖర్, ఎం.మోహన్‌రావు, కె. వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన

శేరిలింగంపల్లి: నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ నాగమల్లేశ్వరి, లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, సీఓ శ్రీకాంత్, శానిటేషన్ సిబ్బంది, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఖాజాపాష, రాంచందర్ పాల్గొన్నారు.

అక్రమ నీటి వ్యాపారాన్ని అరికట్టాలి

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డి నగర్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో అక్రమ నీటి వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ మేరకు సోమవారం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బస్తీవాసులతోకలిసి ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింలు ముదిరాజ్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, అనంతరాములు, కె.వి రాజు మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ధర్మారావు పాల్గొన్నారు.

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడకు చెందిన శ్రీనుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.50 లక్షలు మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే గాంధీ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు నాయి నేని చంద్రకాంత్‌రావు పాల్గొన్నారు.